ప్రజాశక్తి

ఆదివారం 12 అక్టోబర్ 2025 5 శ్రీ సత్యసాయి





పెనుకొండ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తితో మాట్లాడుతున్న డా॥గేయానంద్, సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ

ఐద్వా రంగుల హరివిల్లు

◆ 16వ మహాసభకు 16 వేల ముగ్గులు

◆ చైతన్య స్ఫూర్తి నింపేలా రంగవల్లులు

◆ ముగిసిన సాంస్కృతిక ఉత్సవాలు

◆ రేపు ఐద్వా రాష్ట్ర మహాసభ 'అనంత'లో ఆరంభం



మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న ఐద్వా నాయకులు



మహిళల గొప్ప తనాన్ని తెలియజేస్తూ ఇంటి ముందు వేసిన ముగ్గు

ప్రజాశక్తి-అనంతపురం

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) 16వ రాష్ట్ర మహాసభల సందర్భంగా మహిళామణులు ఇళ్ల ముందు రంగుల హరివిల్లును ఆవిష్కృతం చేశారు. మహిళా శక్తిని కీర్తిస్తూ.. సమానత్వాన్ని సూచిస్తూ.. పోరాటాన్ని తెలిజేస్తూ రంగవల్లులను ఇళ్ల ముందు వేశారు. 16వ మహాసభలకు గుర్తుగా 16వేల ముగ్గులను అనంతపురం నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఇళ్ల ముందు మహిళలు వేశారు. మల్లు స్వరాజ్యం కాలనీ, సీతారామ్ ఏచూరి కాలనీ, గణనాయక్ నగర్, మహదేవ్ నగర్, ఇందిరానగర్‌లలో ఈ ముగ్గులను వేశారు. ముగ్గులను ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి తదితరులు పరిశీలించారు. మహిళల గొప్పతనాన్ని చాటేలా ముగ్గులు వేసిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1936లో కృష్ణాజిల్లాలో ఆంధ్ర మహిళా సంఘం ఏర్పడిందన్నారు. ఆనాటి నుంచి దేశవ్యాప్తంగా మహిళా సమస్యలపై కృషి చేస్తోందని చెప్పారు. ఆస్తి హక్కు, వరకట్న వేధింపుల నిరోధక చట్టం, లైంగిక వేధింపుల నిరోధక చట్టం, నిర్భయ గహహింసవంటి అనేక చట్టాలను సాధించుకోవడానికి ఐద్వా అనేక ఉద్యమాలను చేపట్టిందని తెలియజేశారు. లింగ సమానత్వం కాకుండా జాతీయ, మత, కుల, ప్రాంత, భాష భేదాలకు వ్యతిరేకంగా పోరాడే ప్రగతిశీల మహిళా ఉద్యమం ఐద్వా అన్నారు. ఈ నెల 13,14,15వ తేదీలలో అనంతపురంలో జరిగే ఐద్వా 16వ రాష్ట్ర మహాసభల్లో జిల్లా వాసులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, చంద్రిక, నగర కార్యదర్శి అశ్విని, నగర అధ్యక్షులు శంషదు, జిల్లా నాయకురాలు రామాంజినమ్మ, గీత, శైలజ, పద్మావతి పాల్గొన్నారు.

ముగిసిన సాంస్కృతిక ఉత్సవాలు

ఐద్వా రాష్ట్ర 16వ మహాసభ ఈనెల 13,14,15వ తేదీల్లో మూడు రోజల పాటు అనంతపురం నగరంలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 9నుంచి 11వ తేదీ వరకు అనంతపురం నగరంలో సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించారు. మొదటి రెండు రోజులు కృష్ణా కళామందిరంలో జరిగితే ఆఖరి రోజు శనివారం ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో జరిగాయి. ఈ సాంస్కృతిక ఉత్సవాల్లో ఆఖరి రోజు పెద్దఎత్తున బాలికలు, బాలురు పాల్గొని ప్రదర్శనలు చేపట్టారు. ఆట,పాటలతో సాగిన ఈ ఉత్సవాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమానికి ఐద్వా నాయకులు ప్రగతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, కోశాధికారి సావిత్రిలతో పాటు ఆల్ ఇండియా రేడియో ప్రవక్త శ్యామ సుందర శాస్త్రి, కవి రియాజుద్దీన్, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, చంద్రిక, నాయకులు రామాంజినమ్మ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిరి, పరమేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ సమాజంలో నేటికి అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. కుటుంబం నుంచి మహిళ పట్ల వివక్ష, చిన్నచూపు ఉంటోందని పేర్కొన్నారు. సమానత్వం కోసం పోరాడేదే ఐద్వా అని తెలిపారు. ఐద్వా సాగిస్తున్న ఈ పోరాటంలో అందరూ భాగస్వామ్యులై న మహిళాభివృద్ధికి తోడ్పాటునందివ్వాలని పిలుపునిచ్చారు.

ఐద్వా రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి
డాక్టర్ ప్రసూన ఐద్వా నాయకులు

అనంతపురం నగరంలో ఈనెల 13 నుంచి జరుగుతున్న ఐద్వా 16వ రాష్ట్ర మహాసభను అందరూ జయప్రదం చేయాలని ఐద్వా నాయకురాలు డాక్టర్ ప్రసూన పిలుపునిచ్చారు. ఈనెల 13వ తేది ఉదయం 10.30 గంటలకు ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి ర్యాలీ ఆరంభమవుతుందన్నారు. అనంతరం లలిత కళాపరిషత్ హాలులో బహిరంగ సభ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



ఐద్వా సాంస్కృతిక ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి



సాంస్కృతిక ఉత్సవాల్లో చిన్నారుల ప్రదర్శన



సాంస్కృతిక ఉత్సవాలను వీక్షిస్తున్న మహిళలు, విద్యార్థినులు

వైద్యసేవల నుంచి తప్పుకునే కుట్ర

◆ ప్రభుత్వ ఆధీనంలోనే వైద్య కళాశాలలను నడపాలి

◆ పిపిపి మోడల్ విధానంతో అన్ని విధాలా నష్టం

◆ రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పిపిపి మోడల్ పేరుతో ప్రభుత్వ కళాశాలలను ప్రయివేటు పరం చేసే కుట్ర చేస్తోందని, ఇది పేదలను ప్రభుత్వ వైద్యానికి, పేద విద్యార్థుల ప్రభుత్వ వైద్య విద్యకు దూరం చేయడం అవుతుందని రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అభివృద్ధి వేదిక నాయకులు రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో గేయానంద్ మాట్లాడుతూ పెనుకొండలోని వైద్య కళాశాలకు గత ప్రభుత్వం రూ.30 కోట్ల ఖర్చు పెట్టిందన్నారు. ఇప్పుడు ప్రయివేటుకు ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫీజులు నామ మాత్రంగా ఉంటాయని, ప్రయివేటు పరం అయితే లక్షలాది రూపాయల ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రకృతి వనరులను ప్రయివేటు పరం చేయడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. కార్పొరేట్‌లకు వేల కోట్ల అప్పులు మాఫీ చేస్తారు కానీ వైద్య కళాశాలల నిర్మాణానికి రూ. 3 వేల కోట్లు ఖర్చు చేయకపోవడం దివాలా కోరుతనానికి నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహులు మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేస్తే ప్రజల నుంచి ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆధీనంలోనే వైద్య కళాశాల నిర్మాణం చేపట్టాలన్నారు. జెవివి రాష్ట్ర నాయకులు ఆదిశేషు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా పిపిపి మోడల్ విజయవంతం కాలేదన్నారు. పుట్టపర్తి రమణారెడ్డి మాట్లాడుతూ పిపిపికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ కరోనాలో ఆదుకున్నది ప్రభుత్వ వైద్యమే అని, ప్రయివేటు పరం చేస్తే పేదలు, మధ్య తరగతికి విద్య, వైద్యం దూరం అవుతాయన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఓ మాట తర్వాత ఓ మాట చెప్పి ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను దూరం చేయడం భావ్యం కాదన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హరి, జడ్పి శీన, ఈఎస్.వెంకటేష్, పెద్దన్న, రైతు సంఘం జిల్లా నాయకులు ఫక్రుద్దీన్, గిరీష్, శ్రీనివాసాచారి, సిఐటియు నాయకులు సదాశివ, ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, షబానా, రమాదేవి, ఎడబ్ల్యు డబ్ల్యు నాయకులు భావమ్మ, కెవిపిఎస్ జిల్లా నాయకులు రమణ, ఆంజనేయులు, ముత్యాలు, నారాయణ, గంగాధర్, వెంకటరాముడు, నారాయణస్వామి, రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈరేష్, నామాల నాగార్జున, జెవివి నాయకులు మహేంద్రరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, ఎఐఎస్ఎఫ్ నాయకులు శివ, ప్రముఖులు అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి పరిశీలన

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వివిధ వార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏఏ రోగాలకు వైద్య పరీక్షలు అందిస్తున్నారని వైద్యులను అడిగారు. మహిళలు, పురుషుల వార్డులను పరిశీలించి వైద్య సేవలపై రోగులను ఆరా తీశారు. అనంతరం ఎన్టీఆర్ వైద్య సేవ ఆరోగ్య మిత్రతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బాధితులకు న్యాయం చేయాలి : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపర్చి బాధితులకు న్యాయం జరిగేలా, సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ కోర్ట్ మానిటరింగ్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో శనివారం జిల్లాలోని కోర్టు మానిటరింగ్ సిబ్బంది, పోలీస్ స్టేషన్లకు చెందిన కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్ష, సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. అన్ని ట్రయల్ కేసుల్లో సత్వర, సక్రమ విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టులలో ఛార్జ్ షీట్ ఫైల్ చేసిన అనంతరం కోర్టు ద్వారా సంబంధిత కేసుల్లో సీసీ నెంబర్లను తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నూతనంగా అమల్లోకి వచ్చిన బిఎన్ఎస్-ఎస్ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కొత్త చట్టం మేరకు కోర్టు ప్రొసీడింగ్స్ జరిగేలా చూడాలన్నారు. ప్రతి కోర్టు కానిస్టేబుల్ విధిగా తన పోలీస్ స్టేషన్‌కు సంబంధించి కోర్టులో హాజరవుతున్న ప్రతి కేసు గురించి అవగాహన పెంచుకుని సరైన సాక్ష్యాధారాలతో నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. సమావేశంలో డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, సిఐ బొజ్జప్ప, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఐటీ కోర్ ఇన్‌ఛార్జి సుదర్శన్‌రెడ్డి, కోర్ట్ మానిటరింగ్ సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

హిందూపురానికి చేరిన హంద్రీనీవా జలాలు

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్నో ఏళ్లుగా మండల ప్రజలు ఎదురుచూసిన హంద్రీనీవా జలాలు శనివారం హిందూపురానికి చేరాయి. ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని హంద్రీనీవా జలాలను హిందూపురానికి రప్పించారు. హిందూపురం రూరల్ మండల పరిధిలోని కిరికెర పంచాయతీ అప్పలకుంట వద్ద నీరు విడుదల చేశారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు హెచ్ఎన్.రాము ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నేతలు గంగా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎన్ రాము మాట్లాడుతూ శాసనసభ్యులు నందమూరి బాలకష్ణ ప్రత్యేక చొరవ చూపడంతో కిరికెర పంచాయతీ అప్పలకుంట చెరువులో హంద్రీనీవా నీరు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హంద్రీనీవా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న టిడిపి నాయకులు



మొక్కజొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

రైతుల గోడు పట్టని ప్రభుత్వం

మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-రొద్దం

పంటలకు కనీస మద్దతు ధర దక్కక రాష్ట్ర వ్యాప్తంగా రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా కూటమి ప్రభుత్వం వారి గోడు పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. ఆమె శనివారం మండలంలోని తాడంగిపల్లి గ్రామంలో మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న పంట కోసి నూర్పిడి చేసి ఎన్ని రోజులైనా ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకుండా రైతులకు అన్యాయం చేస్తుందన్నారు. వెంటనే గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. మండలంలో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న పంట పండించారని, అయితే సరైన ధర లేక పెట్టిన పెట్టుబడులు కూడా రాక అప్పుల ఊబిలో కూరుకుపోతు న్నారన్నారు. మంత్రిలు, అధికార యంత్రాంగం కనీసం వారివైపు కన్నెత్తికూడా చూడకపోవడం దుర్మార్గమన్నారు. మొక్కజొన్న, మిరప, పత్తి, జొన్న, కందులు, మినుములు, పెసలు, సజ్జలు, రాగులు, వేరుశెనగ, టమోటా, అరటి, చీని, ఇలా ఏ పంటకూ కనీస మద్దతు ధర కల్పించడం లేదని మండిపడ్డారు. మొక్కజొన్న కొనుగోలు అంశం కేంద్రం పరిధిలో లేకపోయినా నాఫెడ్ కొనుగోలు చేస్తుందని చంద్రబాబు నమ్మబలికారన్నారు. క్వింటా రూ. 2,800తో కొనుగోలు చేస్తామని చెప్పి రైతుల నుంచి ఒక్క క్వింటా కూడా కొనుగోలు చేయలేదన్నారు. వైసిపి హయాంలో కనీస మద్దతు ధరల జాబితాలో లేని అనేక పంటల రైతులను ఆదుకున్నామన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 300 కోట్లు కేటాయించడమే దారుణం అంటే, అందులో కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టిన దాఖలాలు లేవన్నారు. ధాన్యం, పొగాకు, ఆక్వా రైతులు ఆయా జిల్లాల్లో ఆందోళనలు చేస్తుంటే చంద్రబాబు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం పంటలకు కనీస ధరలు కల్పించి, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ తిమ్మయ్య, నాయకులు ఎన్.నారాయణరెడ్డి, సి.నారాయణ రెడ్డి, లక్ష్మినారాయణ రెడ్డి, ఫయాజ్ బాషా, తదితరులు ఉన్నారు.

'పురం' అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

◆ ప్రభుత్వ ఆసుపత్రికి పూర్వవైభవం తీసుకొస్తాం

◆ రైతులకు గిట్టుబాటు ధర అందించే బాధ్యత నాదే

◆ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ



ఆర్ అండ్ బి అతిథి గహంలో జిల్లా కలెక్టర్ తో కలిసి అధికారులతో సమీక్షిస్తున్న బాలకష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ తెలియజేశారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి పురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి అభివద్ధి కమిటీ, వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఎపిఐఐసి, రెవెన్యూ అధికారులతో మలగూరు, చలివెందల పొలాలకు సంబంధించి జరుగుతున్న భూ సేకరణపైన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ విలేకరులతో మాట్లాడారు. హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి పాలనలో ఆసుపత్రికి అభివృద్ధికి అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలియజేశారు. ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను త్వరలో భర్తీ చేస్తామన్నారు. మార్చురీ గది నిర్మాణానికి రూ.79 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. ప్లాస్మా థెరపీని అందుబాటులోకి తీసుకొచ్చి రెఫర్ల సంఖ్యను తగ్గిస్తామన్నారు. స్కానింగ్, సిటీ స్కానింగ్ అందుబాటులో లేని నేపథ్యంలో రోగులకు అసౌకర్యం కలగకుండా పట్టణంలోని గురుస్కాన్‌లో పరీక్షలు నిర్వహించేలా ఎంఒయు చేసుకున్నామని చెప్పారు. త్వరలో రేడియాలజిస్ట్ నియమించి స్కానింగ్‌తో పాటు సిటీ స్కాన్ సేవలను సైతం అందుబాటులోకి తీస్తామన్నారు.

పారిశ్రామిక అభివద్ధి కోసమే భూసేకరణ

హిందూపురం ప్రాంతంలో ఏరో స్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్ పరిశ్రమలు వస్తున్నాయని బాలకృష్ణ తెలిపారు. వీటితోపాటు మరిన్ని పరిశ్రమలను తీసుకొచ్చి స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు మంచి ధర ఇచ్చే బాధ్యత తమదన్నారు. మార్కెట్ ధర కన్నా అదనంగా రైతులకు భూ పరిహారమిచ్చి భూసేకరణ చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో పెనుగొండ సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్, తహశీల్దార్ వెంకటేశు, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ అన్నపూర్ణ, ఆర్ఎంఒ శివకుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో జరిగిన మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన మున్సిపల్ ఉపాధ్యాయులను ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ సన్మాన వేడుకకు ఉమ్మడి జిల్లాలోని పలు మున్సిపాల్టీలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు, ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వారందరినీ శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, పెనుకొండ ఉప విద్యాశాఖ అధికారి జాన్ రెడ్డప్ప, హిందూపురం మండల విద్యాశాఖ అధికారి గంగప్ప పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు శ్రీ రామ్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సిద్ధగిరి శ్రీనివాసులు, బాలకష్ణ ,చంద్రనాయక్, జిల్లా కార్యదర్శి జనార్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, ఆన్సర్ , కేశవరెడ్డి తదితర సభ్యులు పాల్గొన్నారు.



సన్మానం చేసిన ఉపాధ్యాయులతో మున్సిపల్ చైర్మన్, ఎంటీఎఫ్ నాయకులు

బాలయేసులో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని బాలయేసు డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ జియావుల్లా ఖాన్ అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, బాలయేసు విద్యాసంస్థల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శౌరిరెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు అధ్యాపకులు చెప్పే విషయాలను శ్రద్ధగా విని పట్టుదల, క్రమశిక్షణతో భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి

'ధన ధాన్య'ను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

'ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన' పథకాన్ని జిల్లాలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సూచించారు. దేశ రాజధాని ఢిల్లీలో శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే పరిటాల సునీత, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, వ్యవసాయ అనుబంధ శాఖల అధికా రులు, రైతులు వర్చువల్‌గా హాజరయ్యారు. సమావేశం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం అమలుకు దేశవ్యాప్తంగా వంద జిల్లాలను ఎంపిక చేయగా శ్రీసత్య సాయి జిల్లా కూడా ఉందన్నారు. ఈ పథకం ద్వారా జిల్లా లబ్ధి పొందనుందన్నారు. ఎమ్మెల్యే సునీత, మాజీ మంత్రి పల్లె మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. అనంతరం అభ్యుదయ రైతులను కలెక్టర్, ముఖ్యఅతిథులు సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి రామునాయక్, ఉద్యానవన, పశు వైద్య శాఖ అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, శుభదాస్, డిఆర్‌డిఎ పిడి నరసయ్య, పట్టు, మత్స్య, డ్వామా, తదితర శాఖల జిల్లా అధికారులు, అభ్యుదయ రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.



వర్చువల్ విధానంలో పాల్గొన్న కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, రైతులు

బాలికల విద్యతో కుటుంబం, సమాజాభివృద్ధి

ప్రజాశక్తి-బత్తలపల్లి

బాలురతో పాటు బాలికలను సమానంగా ప్రోత్సహిస్తే విద్యలో రాణించి కుటుంబం, సమాజా భివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని సర్వశిక్ష అభి యాన్ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవరాజు తెలిపారు. మండలంలోని సంజీవ పురం కెజిబివిలో శనివారం ప్రిన్సిపల్ గుల్జార్‌బేగం అధ్యక్షతన అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఎస్ఎస్ఎ ఎపిడి దేవరాజు, బాలల సంరక్షణ విభాగం సిబ్బంది నాగలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఎర్రమ్మ, దేవయాని, ఎస్ సోమశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆర్‌డిటి ఫీల్డ్ కార్యాలయంలోని చిల్డ్రన్స్ హోంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్‌డిటి రీజియన్ డైరెక్టర్ హనుమంతప్ప మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో రాణించాలనే ఉద్దేశంతో ఆర్‌డిటి సంస్థ మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

పుట్టపర్తి రూరల్ : బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది ముందుండాలని ఐసిడిఎస్ సిడిపిఒ జయంతి సూచించారు. మండలంలోని జగరాజుపల్లి కెజిబివిలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. సిడిపిఒ మాట్లాడుతూ ఆడ, మగ భేదం లేకుండా అందరినీ చదివించాలన్నారు. బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత అన్నారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో అధికారులు



పరిగి కెజిబివిలో బాలికా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు

పరిగి : బాలికల హక్కుల పరిరక్షణ లక్ష్యంగా పని చేద్దామని ఐసిడిఎస్ సూపర్వైజర్ లలితమ్మ సూచించారు. స్థానిక కెజిబివిలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం, కిశోరి వికాసం పక్షోత్సవాల కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్వైజర్లు లలితమ్మ, శంకరమ్మ మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, బాలల హక్కులు, చట్టాల గురించి అవగాహన కల్పించారు.


వైద్య శిబిరంలో చికిత్స చేస్తున్న కంటి వైద్య నిపుణులు

కంటి వైద్యశిబిరానికి స్పందన

హిందూపురం : కంటికి సంబంధించిన జబ్బుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ట్రినిటీ సర్వీసెస్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ కుమార్ రాజా, కార్యదర్శి ఉషారాణి సూచించారు. పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఆ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు యశశ్వి, నేహా 625 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 189 మందికి కంటి ఆపరేషన్ అవసరమని నిర్ధారించారు. వీరికి ఉచితంగా ఆపరేషన్ చేసి మందులు, కళ్లద్దాలు అందజేస్తామన్నారు. రోగులకు జిఆర్ రమేష్, కల్లూరు ప్రభు భోజనం అందజేశారు. శిబిరంలో వాలంటీర్ నరసింహమూర్తి, రహంతుల్లా, క్యాంప్ ఇన్‌ఛార్జి శివప్రకాష్, శంకర్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి, బోయ సంఘం మండలాధ్యక్షునిగా నాగేంద్ర

పెనుకొండ : వాల్మీకి, బోయ సంఘం మండల అధ్యక్షునిగా మండలంలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన జక్కప్పగారి నాగేంద్ర ఎన్నికయ్యారు. శెట్టిపల్లిలో శనివారం రాష్ట్ర వాల్మీకి బోయ సంఘం వైస్ ప్రెసిడెంట్ కేశవ ఆధ్వర్యంలో నాగేంద్రను ఎంపిక చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ నరేష్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు మాధవయ్య, రమేష్, ధర్మవరం నియోజకవర్గ, టౌన్ అధ్యక్షులు మంజునాథ్, బాచి పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన

ధర్మవరం రూరల్ : తపాలా శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి, బంగారు భవిష్యత్తును ఇవ్వడమే తపాలా శాఖ ముఖ్య లక్ష్యమని ప్రధాన తపాలా పోస్ట్‌మాస్టర్ భానుకుమార్ తెలిపారు. ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకూ తపాలా వారోత్సవాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఖాతాదారులు, ప్రజలకు ఆధార్ సేవలు అందిస్తామన్నారు. అలాగే తపా లా శాఖ అమలు చేస్తున్న పథకాలపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్రజలకు అన్ని రకాలుగా సేవలు చేయడంలో తపాలా శాఖ ఎల్లప్పుడూ ముందంజలోనే ఉంటుందని, ప్రజలు తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తపాలా కార్యాలయ అధికారులు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం

బుక్కపట్నం : సిఎం చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన, అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన పార్వతీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో శనివారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో పల్లె ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. పల్లె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ ఒకటిన్నర సంవత్సర కాలంలోనే సూపర్ సిక్స్ పథకాలు, ఎన్నికల హామీలన్నీ అమలు చేసి ప్రజలకు సుపరిపాలన అందిస్తుందన్నారు. అనంతరం ఆయన ఇటీవల మృతి చెందిన టిడిపి కార్యకర్త నారాయణస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మీ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట అప్పస్వామి, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, కిష్టప్ప, గంగాధర్ ఉన్నారు.

సోలార్ భూసేకరణ చేపట్టాలి : ఆర్డీవో

నంబులపూలకుంట : సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్డీవో వివిఎస్.శర్మ ఆదేశించారు. ఈ విషయంపై శనివారం ఆర్డీవో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. కంపెనీ ఎకరాకు ఏడాదికి రూ. 30వేల చొప్పున భూమి యజమానికి చెల్లిస్తుందని, మీ భూములు మీ పేరు మీదనే ఉంటాయని రైతలకు భరోసా కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు భూములపై హక్కులు ఉంటాయని క్షేత్రస్థాయిలో భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథం, తహశీల్దార్ దేవేందర్‌నాయక్, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల తనిఖీ

నల్లచెరువు : స్థానిక బిసి, కెజిబివి హాస్టళ్లను శనివారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటలక్ష్మమ్మ, పిహెచ్‌సి సిహెచ్‌ఒ రామచంద్రారెడ్డి సందర్శించారు. వారు హాస్టల్ గదులు, వంటశాల, మరుగుదొడ్లను పరిశీ లించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని వార్డెన్లను ఆదేశించారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అనారోగ్యం పాలైతే వెంటనే సమీప పిహెచ్‌సికి తీసుకెళ్లి వైద్యం చేయించాలని వార్డెన్‌కు సూచించారు. కూరగాయలు, వంట చేసే విధానం, పరిశుభ్రత గురించి ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కెజిబివిలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో పాల్గొన్నారు. బాల్య వివాహాలు, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై బాలికలకు అవగాహన కల్పించారు. వారి వెంట పిహెచ్‌సి సూపర్వైజర్ సుధాకర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ జయమ్మ, హాస్టల్ వార్డెన్స్ గోవిందరెడ్డి, శిరీష, ఎఎన్ఎం మేరీ, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్‌లో స్టేజ్ నిర్మాణానికి అనుమతి

కొత్తచెరువు : స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్టేజ్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరుతూ శనివారం హెచ్‌ఎం గోపాల్, రిటైర్డ్ హెచ్‌ఎం వెంకన్న జడ్పీ సీఈవో శివశంకర్‌కి వినతి పత్రం అందజే శారు. స్పందించిన జడ్పీ సిఇఒ వెంటనే స్టేజ్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. రిటైర్డ్ హెచ్‌ఎం ఎన్‌సి.నరసప్ప, వారి కుటుంబ సభ్యులు స్టేజ్ నిర్మాణానికి నిధులు ఇస్తామని తెలిపారు.

'కూచిపూడి' శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం రూరల్ : పట్టణంలోని కూచిపూడి కళా కేంద్రంలో కూచిపూడి శిక్షణకు విద్యార్థినులు దరఖాస్తు చేసుకో వాలని యోగివేమన యనివర్సిటీ అడ్వైజర్ కళా కేంద్రం గౌరవ సలహాదారు ప్రొఫెసర్ కృష్ణమూర్తి, నాట్య గురువు కీర్తన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. యుజి, పిజి, బిఈఏ, విద్యార్థినులకు కూచిపూడి భరతనాట్యం నేర్పించి వైవియూ ద్వారా నృత్య సంగీతంలో సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు. ఈ నెల 20వ తేదీ లోపు కూచి పూడి కళా కేంద్రంలో సంప్రదించాలని కేంద్రం సెక్రటరీ మంజుల తెలిపారు.

నోట్ పుస్తకాలు పంపిణీ


కదిరి టౌన్ : మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం పట్టణంలోని మాధవ గురుకులంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఎస్ఈసి) సభ్యులు డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆధ్వర్యంలో డా. బత్తల రామ్‌ప్రసాద్ గురుకుల పాఠశాలల పిల్లల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు నిత్యావసర సరుకులు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ బాబా, చికెన్ జాకీర్, వైసిపి నాయకులు జియా, శ్రీకాంత్, రామకృష్ణ, కిరణ్, బాబ్‌జాన్, తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-నంబులపూలకుంట

సోలార్ ప్లాంట్ కోసం మండలంలో బలవంతపు భూసేకరణను తక్షణమే ఆపాలని ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. భూ సేకరణపై గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలన్నారు. ఎన్‌పి.కుంటలో శనివారం ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు రమణయ్య, కెకె.రాజారెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సోలార్ ప్లాంట్ కోసం మండలంలోని మర్రి కొమ్మదిన్నె, వెలిచెలమల, ఎదురదొన్న గ్రామాల్లో రైతుల నుంచి బలవంతంగా భూములను తీసుకో వడం తగదన్నారు. గతంలో 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి పేరుతో చేపట్టిన భూసేకరణ సమయంలో చేసిన వాగ్దా నాలు గుర్తు చేశారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి తుంగ లో తొక్కారన్నారు. గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల కార్మికులను చేర్చుకుని భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం చేశారన్నారు. ప్రధానంగా కార్పొరేట్ సంస్థలకు వ్యవసాయ భూములు వశం చేయడం ఏంటని ప్రశ్నించారు. భూ సేకరణపై గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని, అలాకాకుండా స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో సంతకాలు చేపట్టి సోలార్ ప్లాంట్ భూములను అప్పజెబితే ప్రజల తరఫున ఎపి రైతు సంఘం అడ్డుకుంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగరాజు, రైతు సంఘం నాయకులు గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


అధికారికి వినతి పత్రం ఇస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి-రొద్దం

జాతీయ యువ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం టింబక్టు కలెక్టివ్, చిగురు సంస్థల ఆధ్వర్యంలో యువతకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో పెనుకొండ, రొద్దం మండలాల్లోని చిగురు, మహాశక్తి, కల్పవల్లి, మిళిత, ధరణి సంఘాల్లోని సుమారు 250 మంది యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టింబక్టు కలెక్టివ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుకన్య మాట్లాడుతూ యువత సంతోషంగా కలిసిమెలిసి ఎదగాలని పిలుపునిచ్చారు. పరస్పరం గౌరవించుకుంటూ అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన మేనేజర్ మహేష్ మాట్లాడుతూ ఆటలు శారీరక, మానసిక ఆరోగ్యానికి చాలా ముఖ్యమన్నారు. యువత వివిధ క్రీడల్లో నైపుణ్యం సాధించాలన్నారు. ఖోఖో, వాలీబాల్, షాట్‌పుట్, మ్యూజికల్ చైర్స్, కుండ కొట్టడం, తదితర పోటీలు నిర్వహించారు. జానపద గీతాలు, చెక్క భజన ఆకట్టుకున్నాయి. ఆయా పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చిగురు సంస్థ మేనేజర్ విభా, కోఆర్డినేటర్స్ పూర్ణిమ, వై.రామన్న, టింబక్టు కలెక్టివ్ నుంచి కోఆర్డినేటర్స్, మహాశక్తి సీఈఓ రమీజా, మహాశక్తి మేనేజర్ గౌరీ, కల్పవల్లి టీం సభ్యులు పాల్గొన్నారు.


వాలీబాల్ ఆడుతున్న యువత

అటవీ శాఖ చెక్‌పోస్ట్‌లో కానరాని ఉద్యోగులు..!

ప్రజాశక్తి-ముదిగుబ్బ

బుక్కపట్నం అటవీ రేంజ్ పరిధిలో దొరిగల్లు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ పేరుకు మాత్రమే అని అక్కడ సిబ్బంది ఎవరూ ఉండరన్న విమర్శలు ఉన్నాయి. ఈ చెక్‌పోస్ట్ మండల కేంద్రమైన ముదిగుబ్బకు 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ బీట్ ఆఫీసర్, ప్రొటెక్షన్ వాచర్ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ప్రొటెక్షన్ వాచర్ మాత్రం అప్పుడప్పుడు అలా వచ్చి ఇలా వెళ్తుంటారు. రాత్రి 9 గంటలు అవగానే ఏ ఒక్కరూ ఉండటం లేదు. ఇక బీట్ ఆఫీసర్ ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు పోతారో.. ఎవరికీ తెలియడం లేదు. దీంతో ఇది పేరుకు మాత్రమే చెక్ పోస్ట్.. సిబ్బంది సక్రమంగా ఉండరు.. ఎలాంటి తనిఖీలు చేయరని ఈ ప్రాంతం ప్రజలు పేర్కొంటున్నారు. ఇకనైనా అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ చెక్‌పోస్టులో సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అటవీశాఖ చెక్‌పోస్ట్..

సిడిపిఒగా ఉద్యోగోన్నతి.. సన్మానించిన అంగన్వాడీలు

ప్రజాశక్తి-లేపాక్షి

కంచిసముద్రం సెక్టార్‌లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న జయమ్మ సిడిపిఒగా ఉద్యోగోన్నతి లభించింది. ఆమె సిడిపిఒగా కడప జిల్లాలోని జమ్మలమడుగుకి బదిలీ అయింది. దీంతో శనివారం మండలంలోని పులిమితి గ్రామంలో కంచిసముద్రం సెక్టార్‌లోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జయమ్మ మాట్లాడుతూ విధి నిర్వహణలో సహాయ, సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


జయమ్మను సన్మానిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ఖాద్రీశుని ఆలయానికి భక్తుల తాకిడి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

నవ నారసింహుని క్షేత్రాల్లో కెల్లా భక్త ప్రహ్లాద సమేతంగా స్వయంభువుగా వెలసిన క్షేత్రం పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయం. చారిత్రాత్మకంగా వాసికెక్కిన ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం. రెండవ శనివారం కావడంతో స్వామి వారి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. స్వామి ఇలవేల్పుగా ఉండే భక్తులు, కర్నాటకలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి రావడంతో ఆలయ ప్రాంగణంతో పాటు తిరుమాడ వీధులు కిక్కిరి సాయి. ముందుగా భక్తులు తలనీలాలు సమర్పించారు. తులాభారం, మొక్కుబడి సమర్పించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు అతి శీఘ్రదర్శనం, ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు నైవేద్య ప్రసాదం అందజేసి అన్నదానం ఏర్పాటు చేశారు.

నిరాధార ఆరోపణలు తగదు

ధర్మవరం రూరల్ : జిల్లాలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖకు సంబంధించి కొన్ని దినపత్రికలు అవాస్తవాలు రాయడం తగదని డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్ తెలిపారు. ఆయన శనివారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నాటుసారా, మద్యం అక్రమ విక్రయాలపై జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున దాడులు నిర్వహిస్తూ, కేసులను నమోదు చేస్తున్నామని తెలిపారు. నాటుసారా వల్ల కలిగే నష్టాలు, మద్యం అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా చేపట్టే కేసులపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. దాడుల విషయంలో కల్తీ మద్యం ఆధారాలు లేవని, వ్యక్తిగత ప్రయోజన కోసం చేసినవి రాయడం తగదన్నారు. రాజకీయాలకు అతీతంగా చట్టబద్ధంగా విధులు నిర్వర్తిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట సిఐ చంద్రమణి, ఎస్ఐ చాంద్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రొద్దం : మండలంలోని ఆర్.మరవపల్లి పెట్రోల్ బంక్ వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. మండలంలోని తాడంగిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు కియా పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నారు. ఈ క్రమంలో వారు విధులు ముగించుకొని పెట్రోల్ బంక్‌లో పెట్టిన ద్విచక్ర వాహనం తీసుకొని స్వగ్రా మం బయల్దేరారు. అదే సమయంలో పెనుకొండ వైపు నుంచి వెళ్తున్న ఓ కారు వీరిని వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని రొద్దం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు.

భార్య కనిపించలేదని ఫిర్యాదు

కదిరి టౌన్ : ఓ వివాహిత కనిపించకుండా పోయిందని ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని అడపాల వీధి వైఎస్ఆర్ పార్క్ సమీపంలో నివా సం ఉండే హేమావతి ఈ నెల 4వ తేదీ భర్త జగన్నాథంశివతో గొడవపడి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో భర్త ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. సిఐ మాట్లా డుతూ హేమావతి ఆచూకీ తెలిస్తే సిఐ 94407 96851కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

బత్తలపల్లి : మండలంలో చిత్రావతి నది పరి వాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలి స్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. మండలంలోని జ్వాలాపురం క్రాస్ వద్ద శనివారం వేకువజామున అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ధర్మవరం ఆర్డీవో మహేష్ సీజ్ చేశారన్నారు. వాటిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆర్డీవో వెంట రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ముదిగుబ్బలో వరుస చోరీలు

ముదిగుబ్బ : ఇటీవల కాలంలో మండల కేంద్రమైన ముదిగుబ్బలో వరుస చోరీలు జరుగుతున్నాయి. ప్రధానంగా దొంగలు గత మూడు రోజులుగా ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాలను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. ఇది ఆకతాయిల పనా లేక మద్యానికి బానిసైన మందుబాబులు చోరీలకు పాల్పడుతున్నారా, కొత్త వ్యక్తులు చేస్తున్నారా అని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. అయితే ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాల యజమానులు మాత్రం భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రాత్రివేళ గస్తీలు మరింత పకడ్బందీగా చేపట్టి చోరీలను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE: PUTTAPARTHY
O.S NO: 147 of 2023

Between:
G.Radhamma ...Plaintiff
AND
Obulesu ...Defendant

ప్రతివాదికి నోటీసు

To,
Chimala Obulesu S/o Chimala Akkulappa, agesd about 45 gears,Kodapaganipalli village, Kkothacheruvu Mandalam
ఇందుమూలముగా మీకు తెలియజేయడము ఏమనగా పై కేసులోని వాది అయిన Gooty Radhamma W/o Gooty Anjineyulu అను వారు మీపై, ప్రామిసరీ నోటు ద్వారా డబ్బులు రాబట్టుటకు, మీపై, పై నెంబర్ దావా వేసినారు అందువలన మీరు పై కోర్టులో 21.11.2025 తేదీ ఉదయం 10.30 గంటలకు స్వయంగా లేదా మీ తరపున న్యాయవాది ద్వారా హాజరు కావలసిందిగా తెలియజేయడమైయినది . మీరు హాజరు కానీ యెడల పై నెంబర్ దావాలో మీకు పరోక్షంగా తీరామానం చేయబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ఎం. రాజేంద్ర ప్రసాద్ రెడ్డి,
వాదితరపు న్యాయవాది
సెల్ నెం:9441669094

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE: PUTTAPARTHY
O.S NO: 107 of 2024

Between:
Chaganti Rameeja ...Plaintiff
AND
1.Chaganti Babaiah
2.Puletipalli Baba Fakroddin ...Defendants

ప్రతివాదికి నోటీసు

To,
D2: Puletipalli Babafakroddin S/o P.Babaiah, Linga Reddy palli (V), Kanisettypalli post, Kothacheruvu Mandalam, Sri Sathya Sai Dist.
ఇందుమూలముగా మీకు తెలియజేయడము ఏమనగా పై కేసులోని వాది అయిన Chaganti Rameeja D/o C.Nabi Sab W/o M.C.E.Nabi Rasool, , చట్టబధంగా రావలసిన భూములలో వాటా హక్కు రాబట్టుటకు, మీపై, పై నెంబర్ దావా వేసినారు. అందువలన మీరు పై కోర్టులో 23.10.2025 తేదీ ఉదయం 10.30 గంటలకు స్వయంగా లేదా మీ తరపున న్యాయవాది ద్వారా హాజరు కావలసిందిగా తెలియజేయడమైయినది మీరు హాజరు కానీ యెడల పై నెంబర్ దావాలో మీకు పరోక్షంగా తీరామానం చేయబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ఎం. రాజేంద్ర ప్రసాద్ రెడ్డి,
వాదితరపు న్యాయవాది
సెల్ నెం:9441669094

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE: PUTTAPARTHY
I.A 280/24 in O.S 107/2024

Between:
Chaganti Rameeja ...Plaintiff
AND
1.Chaganti Babaiah
2.Puletipalli Baba Fakroddin ...Defendants

ప్రతివాదికి నోటీసు

To,
R2: Puletipalli Babafakroddin S/o P.Babaiah, Linga Reddy palli (V), Kanisettypalli post, Kothacheruvu Mandalam, Sri Sathya Sai Dist.
ఇందుమూలముగా మీకు తెలియజేయడము ఏమనగా పై కేసులోని వాది అయిన Chaganti Rameeja D/o C.Nabi Sab W/o M.C.E.Nabi Rasool, చట్టబధంగా రావలసిన భూములలో వాటా హక్కు భూములను అమ్మకూడదని ఆర్జి మీపై, పై నెంబర్ దావా వేసినారు అందువలన మీరు పై కోర్టులో 23.10.2025 తేదీ ఉదయం 10.30 గంటలకు స్వయంగా లేదా మీ తరపున న్యాయవాది ద్వారా హాజరు కావలసిందిగా తెలియజేయడమైయినది మీరు హాజరు కానీ యెడల పై నెంబర్ దావాలో మీకు పరోక్షంగా తీరామానం చేయబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ఎం. రాజేంద్ర ప్రసాద్ రెడ్డి,
వాదితరపు న్యాయవాది
సెల్ నెం:9441669094

వాహనం ఢీకొని నెమలి మృతి


మృతి చెందిన నెమలి

ప్రజాశక్తి-చిలమత్తూరు

544ఈ జాతీయ రహదారిపై మండలంలోని తుమ్మలకుంట క్రాస్ సమీపంలో శనివారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో నెమలి అక్కడికక్కడే మృతి చెందింది. కాసేపటికే నెమలి కళేబరాన్ని గుర్తుతెలియని వ్యక్తులు మాయం చేశారు. ఇదిలా ఉండగా తుమ్మలకుంట ప్రాంతంలో నెమళ్ల సంచారం అధికంగా ఉన్నప్పటికీ అటవీ శాఖ అధికారులు కనీసం బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతోనే ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.

డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నల్లచెరువు

రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి శ్రేణులందరికీ పార్టీ అండగా ఉంటుందని, ఆ పార్టీ మండల కన్వీనర్ మండెం రవికుమార్‌రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, వైసిపి శ్రేణులపై జరుగుతున్న దాడులకు రక్షణగా ఆ పార్టీ రూపొందించిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను శనివారం రవికుమార్‌రెడ్డి నివాసంలో ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రతి వైసిపి నాయకుడు, కార్యకర్తకు 2029లో జగన్ అధికారంలోకి రాగానే న్యాయం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, అరాచక పాలన, మోసాల గురించి సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పోరెడ్డి వెంకటరెడ్డి, ఆనంద్‌రెడ్డి, నజీర్, బోనాల ఖాదర్‌వలి, సూర్యనారాయణరెడ్డి, శ్రీకంఠరెడ్డి, రఫీ, పూలకుంట సర్పంచి యూసుఫ్, రమణ, నాగభూషణ, ఆదిమూర్తి, నరసింహారెడ్డి, హరి, రమణారెడ్డి, ఖాదర్‌వలి, ఇర్ఫాన్, పోరెడ్డి చెన్నకేశవరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, షఫీ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

కునుకేస్తే కనుమరుగు..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

భూమి పత్రాలు ఇంట్లో సురక్షితంగా ఉన్నాయి... తమకు భయం లేదనే రోజులు పోయా యి. ఏ మాత్రం కునుకేసిన అధికారిక రికార్డుల్లో పేర్లు మారిపోతున్నాయి. భూమి విలువ పెరుగు తుండటంతో దాన్ని ఏదో రకంగా తమ వశం చేసుకోవడానికి కొంత మంది ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఈ వ్యవహారం ఎవరు అధికారంలో ఉంటే వారి వైపు నుడస్తూనే ఉంది. గత ప్రభుత్వ హయాం లోనూ ఇదే రకంగా అనేక ప్రాంతాల్లో భూములు తమకు తెలియకుండానే మారిపోయాయి. అసలు యజమానులు తామేనంటూ రికార్డుల్లో సృష్టించి అమ్మకాలు సాగించారు. పదుల ఎకరాల్లోనే ఈ వ్యవహారం నడిచిన ఘటనలు ఆలస్యంగా వెలుగు లోకి వచ్చాయి. తరువాత కేసులు కూడా నమోదైన ఘటనలున్నాయి. ఇక ప్రభుత్వ భూములయితే లెక్కలేదు. వాటిని అడిగేవారు కూడా లేకుండా అయిపోయారు. వీటికి వ్యతిరేకంగా అప్పుడు టిడిపి నీతులు మాట్లాడారు. వారు అధికారంలోకి వచ్చాక కూడా ఇవే కొనసాగుతున్నాయి. వరుసగా ఇతరుల భూములు రికార్డుల్లో మారిపోయాయని బాధితులు బయటకు వస్తూనే ఉన్నారు. జిల్లా కేంద్రమైన అనంతపురం నగరం చుట్టుపక్కల భూముల ధరలు అధికంగా ఉండటంతో ఈ వ్యవహారం జోరుగా సాగుతోందన్న విమర్శ ఉంది. తాజాగా ఈ వారంలో ఎ.నారాయణపురం పంచాయతీ పరిధిలో ఇద్దరు వృద్ధ దంపతులు తమకు జరిగిన అన్యాయం గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వద్దకెళ్లి మొరపెట్టుకోవాల్సి వచ్చింది. ఆ తరువాత గాని అధికార యంత్రాంగంలో కదలిక రాలేదు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు అది డబుల్ రిజిస్ట్రే షన్ అని తేల్చారు. అయినా చర్యలేమేరకు ఉంటా యన్నది చూడాల్సింది. అదే విధంగా ఇదే వారం లోనే గుంతకల్లు, గుత్తి ప్రాంతాల్లోనూ ప్రభుత్వ భూములు పరాధీనం అయినట్టు పెద్ద ఎత్తున ఆరోపణలొచ్చాయి. గతంలోనూ అనంతపురం నగరంలో కక్కలపల్లి, అనంతపురం నగరంలో దుకాణాలు డబుల్ రిజిస్ట్రేషన్ అయి బాధితులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదే వారంలోనే జిల్లా కలెక్టర్ ఆనంద్ సమీక్షలోనూ రెవెన్యూ అధికారుల అడ్డగోలు పనితీరు వెలుగులోకి వచ్చింది. సెక్షన్ 25వ కింద దరఖాస్తు చేసినవి ఫైల్లే కనబడలేదు. దీనిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో రికార్డుల కోసం రెవెన్యూ అధికారులు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అనంతపురం జిల్లాలో ఐసిడిఎస్ పరిధిలో అధికారుల అలసత్వానికి రెండు నెలల బాలుడు మరణించడం రాష్ట్ర స్థాయిలోనే చర్చనీయాంశమైంది. దీనిపై ఇప్పటికే ఐసిడిఎస్ పీడీతోపాటు ఇతరులపై వేటు పడింది. ఇది మరువక ముందే బ్రహ్మసముద్రం మండలంలోని కెజిబివిలో బాలిక మృతి చర్చనీయాంశమవుతోంది. ఇలా వరుసగా అధికారుల పనితీరులోని లోపాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. వీటిని ప్రభుత్వం ఏ మేరకు సరిచేస్తుందన్నది చూడాల్సి ఉంది. ఐద్వా 16 రాష్ట్ర మహాసభ ఈనెల 13 నుంచి అనంతపురం నగరంలో జరుగుతున్న నేపథ్యంలో ఈ వారంలో రోజులపాటు వివిధ రూపాల్లో సన్నాహక కార్యక్రమాలు జరిగాయి. మూడు రోజుల పాటు జరిగిన సాంస్కృతిక ఉత్సవాలు అందరినీ అలరించాయి. ఇక వచ్చే వారంలో మూడు రోజులపాటు అనంతపురం నగరంలోని ఎంకెఎం హాలులో మహాసభ జరగనుంది.